క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పాల బుచ్చన్న సతీమణి శారదమ్మ(65) ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం కొండేరు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ వీరన్న, ఎంపీటీసీ ఈరన్న, నాయకులు ఎర్రన్న, వీరబాబు, తదితరులు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా సీఎస్ఈ మేనేజర్ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు అర్హులని మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కుటుంబ మొత్తానికి రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తుందని పేర్కొన్నారు.

నేడు రాయాపురంలో కంటి వెలుగు

గట్టు: రాయాపురం, మిట్టదొడ్డి గ్రామాల్లో గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు సీహెచ్ఓ ఊసేన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

రాజ్యాధికార యాత్ర విజయవంతం చేయాలి

అలంపూర్: బహుజనుల రాజ్యాధికార యాత్రను విజయవంతం చేద్దామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో బహుజనుల రాజ్యాధికార యాత్ర పోస్టర్‌ను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ నెల 26వ తేదీన పట్టణంలోని జూనియర్ కళాశాలలో సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ యాత్ర ప్రారంభోత్సవ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, నాయకులు సుంకన్న, ప్రభుదాసు, విజయ్, మల్లు, రవి, అనిల్, ముప్పారపు తదితరులు ఉన్నారు.

కనులపండువగా రథోత్సవం



అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం, మండలంలోని సింధనూరులో ఆదివారం మల్లికార్జున స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవంను తిలకించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, బీఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు తదితరులు పాల్గొన్నారు.

యువజన కమిటీ ఏర్పాటు



గట్టు: మండల కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ నూతన మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా రాయాపురం తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా ముచ్చోనిపల్లె అనిత్, నల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల భీమన్న, ప్రచార కార్యదర్శులుగా బోయలూగెం ప్రకాష్, ముచ్చోనిపల్లె అశోక్, కోశాధికారిగా బల్గెర రాజులతో సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి నాగరాజు, సహాయ కార్యదర్శి ప్రసాద్, నాయకులు వేమన్న, దేవప్ప, యేసన్న, ఆశీర్వాదము, వెంకటన్న, పేతూరు, విజయ, నర్సింహులు, బస్వరాజు, మోజేస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గద్వాల క్రైం: ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు శనివారం రాత్రి ఒకరిపై ఒకరు దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. సుంకులమ్మ మెట్టుకు చెందిన వెంకట్‌రాములు, బీసీ కాలనీకి చెందిన షాలుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు చెందిన స్నేహితులు ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నదిఅగ్రహారంలో..



ఎర్రవల్లిలో..



అలంపూర్ చౌరస్తాలో..

ఛత్రపతి జీవితం ఆదర్శం



గట్టు మండలం లింగాపురంలో..



జిల్లా కేంద్రంలోని బాల సదనంలో ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు, చిన్నారులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని అరెకటిక సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి అరెకటిక సంఘం జిల్లా అధ్యక్షుడు అభిలాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలసదనంలో చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వీరశేఖర్, శ్రీకాంత్, రమేష్ బాబు, జనార్దన్ రావు, శివాజీ పాల్గొన్నారు.

గద్వాల: జిల్లా కేంద్రంలోని ఒకటో వార్డు నదిఅగ్రహారంలో శివాజీ చిత్రపటానికి ఆ వార్డు బీజేపీ నాయకుడు బాలు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా యూత్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాత్రి ట్రాక్టర్‌పై ఛత్రపతి శివాజీ చిత్రపటంతో గ్రామంలోని పురవీధుల గుండా ఆటాపాటలతో ఊరేగించారు.

అలంపూర్: పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 393 జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. శివాజీ జీవిత కాలంలో 390 యుద్ధాలు చేసి విజయాలు సాధించారన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం అన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకలకు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రభుదాసు, విజయ్, మల్లు, రవి, అనిల్, ముప్పారపు, కనకం బాబులు ఉన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు బ్రహ్మోజీరావు, కృష్ణోజీరావులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మోటారుసైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి సేవలను కొనియాడారు.

గట్టు: మండలంలోని లింగాపూరంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో, అదేవిధంగా చాగదోనలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, జగదీష్‌చారి, తాయప్ప, శేఖర్ పాల్గొన్నారు.

శాంతినగర్: పట్టణంలోని బీజేపీ సీనియర్ నాయకులు బంగి లక్ష్మన్న నివాసం ఆవరణలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరాక్రమం, బుద్ధి కుశలతతో హైందవ సామ్రాజ్యాన్ని నలుదిశలా విస్తరింపజేసిన శివాజీ అందరికీ ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మధుసూదన్‌గౌడ్, అయ్యారాజు, గురుదత్త అంజి, నూర్‌అహ్మద్, వెంకటేశ్వర్లు, కాశీనాథ్, తిరుమలేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు శివాజీ అని కొనియాడారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు.

రాజోళి: మండల కేంద్రంలో ఆదివారం జై శ్రీరామ్ సేవసమితి ఆధ్వర్యంలో శివాజీ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 69 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగి రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో..



అయిజలో..



రాజోళిలో..

అనాథ బాలికలకు ఆర్థికసాయం



అనాథ బాలికలకు ఆర్థికసాయం చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు

కొల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని బండాయిగుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం అనాథ బాలికలు34 మందికి ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు.

తాడూరు: రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను నట్టేటా ముంచిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ నాగేష్ విమర్శించారు. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మేడిపూర్‌లో నిర్వహించిన సమావేశం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి ముందుంటాం

కొత్తకోట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ టీఎస్ ఎప్పుడు ముందుంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బలపరిచిన గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏప్రిల్ నుంచి ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించడంలో సంఘం ఎంతో కృషి చేసిందని తెలిపారు. మాడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు సైతం ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించేలా పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు టైమ్‌స్కేల్‌ను వర్తింపచేసేటట్లు చూస్తామని అన్నారు. వారికి చైల్డ్‌కేర్ సెలవులు, కేర్‌టేకర్‌ను ఏర్పాటు చేసేట్లు జీవో తీసుకువస్తామని భరోసా ఇచ్చారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో వాట్సాప్, పేస్‌బుక్, ఇన్‌స్టాగాంలలో ఎంతోమంది సైబర్ నేరగాళ్లు యువతను మోసం చేస్తున్నారన్నారు. ఏమైనా ఇబ్బందులు వస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

పశుగ్రాసం కొరత



ఎడ్లబండ్లపై వరిగడ్డిని తెచ్చుకుంటున్న అన్నదాతలు

- మూగజీవాలు విలవిల
- ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.15,000

అయిజ: రోజురోజుకు పశువులకు మేత లేక అల్లాడిపోతున్నాయి. మూగజీవాల ఆకలితీర్చేందుకు అన్నదాతలు అవస్థలు అంతాఇంతా కాదు. కొన్నేళ్లుగా పశుగ్రాసం కొరత ఏర్పడటంతో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు చేసేదేమీ లేక మూగజీవాలను అమ్ముకునే దుస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావులు ఉన్న రైతులు సాంప్రదాయ పంటల సాగుపై ఆసక్తి కనబరచడం లేదు. వాణిజ్య పంటలను అధికంగా సాగు చేయడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. అలంపూర్ నియోజకవర్గంలో వానాకాలంలో సాగు చేసిన వరి పంట ద్వారా వచ్చిన గడ్డినే యాసంగిలో కూడా అదేగడ్డి ఆధారమైంది. పశువులకు సరిపడినంత పశుగ్రాసం దొరకకపోవడంతో అన్నదాతలు అధిక డబ్బును వెచ్చించి కష్ణానది తీరప్రాంతాల్లో వరిగడ్డిని అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆహార ధాన్యాల సాగు తగ్గుముఖం

ఆహార ధాన్యాల సాగు ప్రతి యేడాదికి తగ్గిపోతున్నాయి. దీంతో మూగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. అలంపూర్ నియోజకవర్గంలో సజ్జలు, మొక్కజొన్న, కొర్ర, కంది పంటల సాగు గణనీయంగా తగ్గింది. దానికి ప్రత్యామ్నాయంగా మిరప, ఉల్లి, పత్తి పంటలు ఎక్కువగా సాగుచేస్తున్నారు. దీంతో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది.

రూ. 15వేలు పలుకుతున్న వరిగడ్డి

ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు, నది పరివాహక ప్రాంతాల్లో, బోరుబావులు ఉన్న ప్రదేశాల్లో ఆహార ధాన్యాల పంటలు అధికంగా సాగుచేయడం లేదు. దీంతో పశుగ్రాసం దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు ఎకరాల్లో వరిపంట సాగు చేస్తే ఒక ట్రాక్టర్ వరిగడ్డి దొరుకుతుంది. ఒక ట్రాక్టర్ వరిగడ్డికి దాదాపు రూ.12 వేల వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఇతర గ్రామాలకు తరలించాలంటే ట్రాక్టర్ కిరాయి, కూలీల ఖర్చు అదనంగా రూ. 3,000 అవుతుంది. దీంతో మొత్తం ట్రాక్టర్ వరిగడ్డి కోసం రూ. 15,000 ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో పశువుల సంఖ్య

మండలం	గొర్రెలు	గేదెలు	ఆవులు,ఎద్దులు
అయిజ	35334	9923	7423
ఇటిక్యాల	62112	5487	4634
మానవపాడు	2501	43556	3754
అలంపూర్	32478	3298	1976
ఉండవెల్లి	33354	2232	1767
వడ్డెపల్లి	31443	3954	2824
రాజోలి	32065	3965	2821

వాణిజ్య పంటల సాగు వల్లే..



పశువులకు మేత దొరకడం లేదు. రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. వేరుశనగ, కంది, జొన్న పంటలు సాగుచేస్తేనే మేతకు ఇబ్బంది ఉండదు. ఈ పంటల సాగు తగ్గడంతో పశుగ్రాసం కరువయ్యింది. పశువులకు మేత కోసం అవస్థలు పడుతున్నాం. అధిక ధరలకు వరిగడ్డిని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– యాకోబు, ఉప్పల క్యాంప్

వరిగడ్డి మాత్రమే దొరుకుతుంది



పశుగ్రాసం కొనుగోలు చేయాలన్నా వరి తప్ప ఇతర ఆహార ధాన్యాల పశుగ్రాసం దొరకడం లేదు. నదీతీర ప్రాంతాల్లో పండించిన వరి గడ్డి మాత్రమే అందుబాటులో ఉంది. ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు నది పక్కల మాత్రమే వరి సాగు అవుతోంది. దీంతో వరిగడ్డి ధర పెరిగిపోయింది. మేత కొనలేక రైతులు పశువులను అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

– తిమ్మప్ప, కిష్టాపురం

పచ్చి గడ్డిని సాగుచేయాలి



పశుగ్రాసానికి సంబంధించిన పంటలు ఎక్కువగా సాగుచేయకపోవడంతో మండలంలో పశుగ్రాసం కొరత ఎక్కువయ్యింది. రైతులు పొరుగు మండలాల్లో అధిక ధరలకు వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. పశుగ్రాసం కొరత తీరాలంటే బోరుబావులు ఉన్న ప్రదేశాల్లో రైతులు పచ్చి గడ్డికి సంబంధించిన విత్తనాలు చల్లి పశుగ్రాసాన్ని పెంచాలి. సరైన హైబ్రీడ్ వంగడాలు సాగుచేస్తే గడ్డి పెరుగుతుంది. కొంతమేర పశుగ్రాసం కొరతను తగ్గించవచ్చు.

– స్వరూప రాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

వైభవంగా నందికోళ్ల సేవ





అమరవాయిలో నందికోళ్ల సేవలో పాల్గొన్న భక్తులు

మానవపాడు: మండలంలోని అమరవాయిలో ఆదివారం మహాశివరాత్రిని పురష్కరించుకొని నందికోళ్ల సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ఊరేగింపుగా నందికోళ్లసేవా, వివిధ రకాల వేషధారణలో చేసిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అమరవాయిలో మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం రాత్రి నందికోళ్లసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన నందికోళ్లసేవ భాజాభజంత్రీలతో గ్రామ పురవీధుల గుండా కొనసాగింది. అలాగే శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, తూం కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాండురంగాచారి, విజయ్, పరమేష్, కృష్ణయ్య, వీరన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సందెరాళ్ల పోటీలు



బల ప్రదర్శనలో తలపడుతున్న పొటేళ్లు



సందెరాయిని ఎత్తుతున్న యువకుడు

అయిజ: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని పులికల్‌లో అంతరాష్ట్ర స్థాయి సందెరాళ్లు ఎత్తు పోటీలు, పొటేళ్ల బల ప్రదర్శన నిర్వహించారు. సందెరాళ్లు ఎత్తు పోటీల్లో రాయచూరు జిల్లా కుక్కనూరుకు చెందిన అంపయ్య ప్రథమ బహుమతి, జోగుళాంబ గద్వాల జిల్లా బల్గెరకు చెందిన ఎల్లందొడ్డి తిమ్మప్ప ద్వితీయ బహుమతి, మిట్టదొడ్డికి చెందిన ఉరుకుందు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. అదేవిధంగా పొటేళ్ల బల ప్రదర్శనలో కర్నూలు జిల్లా కనకవీడుకు చెందిన వారు మూడు బహుమతులను గెలుచుకున్నారు. నారాయణ పొటేళ్లు ప్రథమ బహుమతి, నాగరాజు పొటేళ్లు ద్వితీయ బహుమతి, బీచుపల్లి పొటేళ్లు తృతీయ బహుమతి కైవసం చేసుకున్నాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



బల్గెరలో గ్రంథాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

గట్టు: మండలంలోని బల్గెరలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అయిజ కమిటీ అధ్యక్షుడు చిన్న వీరేష్ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడు హాజరై మాట్లాడారు. గ్రంథాలను చదివి, జ్ఞానం పొందాలని కమిటీ సభ్యులు గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, నరేష్, దేవేంద్ర, నర్సింహులు, మధు, విజయ్, అక్షయ, లక్ష్మి, కళావతి, పార్వతి, చిట్టెమ్మ, దీపిక, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పరమేశ్వరస్వామి జాతర



ఆత్మకూర్ చెరువులో పరమేశ్వర ఆలయం



కొలువుదీరిన పరమేశ్వరుడు

ఆత్మకూర్: పట్టణంలోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. 21, 22, 23వ తేదీల్లో రాత్రి 9గంటలకు తేరుమహోత్సవం కన్నులపండువగా నిర్వహించనున్నారు. ఆత్మకూర్ సంస్థానాధీశుల కాలం నుంచి పరమేశ్వరస్వామి ఉత్సవాలు గతంలో ఘనంగా నిర్వహించేవారు. కొన్ని అని కారణాల వల్ల జాతర పల్చబడిన నేపథ్యంలో పట్టణంలో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళ, బుధ, గురువారం రాత్రిల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతోపాటు పల్లకీసేవ, రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

మంత్రిని సన్మానించిన వాల్మీకి నాయకులు

మదనాపురం: బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి పంపించినందుకు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఆదివారం ఐక్య వాల్మీకి స్టీరింగ్ కమిటీ సభ్యులు, మండల వాల్మీకులు సన్మానించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నిస్తుందని చెప్పారు. ఇచ్చిన మాటకు సీఎం కేసీఆర్ కట్టుబడి అసెంబ్లీ తీర్మానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమన్న, భీమన్న, పెంటన్న, పాల్గొన్నారు.

మేడిపూర్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభం

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో సహస్త్ర రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఓపెన్ టూ ఆల్ కబడ్డీ టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నీలో 40 టీంలు పాల్గొన్నాయి. తెలంగాణ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రోహిణి, సర్పంచ్ ప్రమీళమ్మ, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్, గ్రామస్తులు జంగిరెడ్డి, ముత్యాలాచారి, యువకులు పాల్గొన్నారు. సోమవారం పోటీలు ముగుస్తాయని, విజేతలకు బహుమతుల ప్రధానం ఉంటుందన్నారు. దాతలు శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, బెల్లె రామకృష్ణ, రామస్వామి, పాల్గొన్నారు.

22న కంటి వైద్యశిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: ఈనెల 22న జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ బీరం శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కంటి వైద్యశిబిరంలో కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొర ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్, ఓటర్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు తప్పనిసరి అని పేర్కొన్నారు.